గొప్పవారితో గుసగుసలు

నన్నయభట్టు

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[తాటాకులింట్లో అలికిన సాలిట్లో సావిడివెడల్పు తిన్నెమీద తుంగచాప. దానిమీద కర్రనేకపు మేజా బల్లముందు విభూతిరేఖలు, రుద్రాక్ష మాల, తెల్లని బట్టలు ధరించి తాటాకులను శుద్ధిచేస్తూ నన్నయభట్టు. అట్లాగే ప్రక్కన మరొక మేజాబల్ల ముందు కూర్చుని ఏదో వ్రాస్తూ నారాయణభట్టు.]

నేను—(ప్రవేశించి. సాష్టాంగ దండప్రణామము)

నన్న—బ్రహ్మస్వరూపమస్తు. ఓ నాయనా: ఎవరు నీవు?

నే—బ్రాహ్మణుణ్ణి—కృష్ణాతీరం.

న—(చాపజరిచి) ఇట్లా కూర్చో. మూడు మైళ్లొచ్చావట,

నే—చిత్తం. తమ దర్శనం కాకపోవడం చేత వచ్చి వచ్చా.

న—ఆకేమీ తీరదు. శ్రీవారికి రాజకీయ వ్యవహారాలు తలక్కించినప్పుడు తప్ప విశ్రాంతి ఉండదు. నేనిప్పుడే వారికి పశ్చిమచాళుక్యుల రాయబారం తటస్థించబట్టి కొంచెం తీరిక చిక్కింది. నీ బస యెక్కడ?

నే—సంటపూటింట్లో

న—వద్దు నీవిక్కడున్నన్ని రోజులూ, మా యింట్లో నుండాలి. అది మా వృత్తిలో చేరిన విషయం.

నే—చిత్తం.

న—నీ రాకకు కారణం?

నే—తమ దర్శనం జేసుకొని సందేహాలు తీర్చుకోవడం. వారెవరు?

న—వారు వేరుగారు. నావంటివారే; నారాయణభట్టు: నా సహాధ్యాయి. సర్వవిషయాల్లో నాకత్యంత సహాయకుడు: వారెల్లు మా యింటి ప్రక్కనే. నీ సందేహాలన్నీ జంకు గొంకు లేకుండా నడగవచ్చు.

నే—కృతార్థుణ్ణి: అయితే మనవి చేసుకొంటాను. తమ భారతాంధ్రీకరణం పూర్తికాలే దేమంది?

న—ఎట్లా పూర్తౌతుంది? భారతమొక మహాసముద్రం, పద్దెనిమిది పర్వాల గ్రంథం. నేను పెద్దవాణ్ణైంతర్వాత తలపెట్టా నా మహాకార్యం; ఏం పూర్తిచేస్తానో అబ్బా అనుకొంటూనే మొదలెట్టా. ఆరణ్యపర్వం ముగించకుండానే ఆపి వెయ్యాల్సొచ్చింది. మా నారాయణం తోడు లేకుంటే నే నా ఆదిపర్వంతోనే ఆపేవాణ్ణి.

నా—నాయనా, ఈయన మాటల్నమ్మకు. అందరితో నట్లాగనడం పరిపాటయిందీయనకు. లేఖన విషయంలోదప్ప నీయనకు నా సహాయం లేదు.

న—అదేమన్నమాట, ఊహ తెలుసుకొని కలసినయెడల దోడ్పడగల బుద్ధిమంతుడవు. వస్తు విషయ మిట్లావుంటే.

ఉ. సారమతిం గవీంద్రులు
ప్రసన్న కథాకవితార్థ యుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర
రమ్యత నాదరింప, నా
నా రుచిరార్థ సూక్తినిధి
నన్నయభట్టు తెనుంగున న్మహా
భారత సంహితారచన
బంధురుడయ్యె జగద్ధితంబుగన్

నా—అందులో 'నానారుచిరార్థ సూక్తినిధి' నాదొకటని, మిగతా పద్యమంతా ఆయనదే.

న—అట్లాంటి నియమాలు పెట్టుకోవడం,విద్వత్సంపన్నుడైన వ్యాసమహాముని సారస్వతం బీరువోకుండా పట్టుకోవడం, పరమావధిగా నుండబట్టే, కావ్యం మరింత భారమైంది.

నే—ఆపద్యంలో 'ప్రసన్నకథాకవితార్థయుక్తి'తో నంటే కథకంట్లకుగట్టినట్టుని అర్థంకాబోలు? 'అక్షరరమ్యత నాదరింప' నంటే రేమిటూ అని?

నా—ఎల్లప్పుడు రమ్యంగావుండని చదవదగ్గదని, వ్యాకరణదోషరహితమైంది కాబట్టి ఆదరించదగ్గదనీ.

నే—నన్నయభట్టీయం గూర్చి న వారు వ్రాయదగ్గమాటన్నారు. తమకు వాగనుశాసన బిరుదం రాజరాజనరేంద్రులవారే ప్రసాదించారా.

న—(ఆశ్చర్యంతో) ఏమిటే! బిరుదా! ప్రసాదించారా! బిరుదేమిటి, శ్రీ వారేమిటి!?

నే—(ఆశ్చర్యంతో) అదేమయ్యా అట్లా గంటారు! తమకాబిరుదు లేదా, శ్రీవారిచ్చింది కాదా?!

న—నారాయణా, ఏమిటి! (నాతో) కవులకు బిరుదులేమిటోయ్! కవియనే బిరుదు చాలదు? అదిపూరికేవస్తుందా? నేనెన్నడు కవినని కూడా అనుకోలేదే.

నే—అదేమిటండీ! మా కాలంలో బిరుదు లేని కవి ఒక్కడూ లేడే!

నా—అంటేకవిశబ్దం వ్యర్థపదమైందన్నమాట! ఎట్లాటి పుస్తకమైనా సరే పుస్తకం వ్రాసిన వాళ్లా కవన్నమాట! బాగుందిసరళి!

నే—(ఆశ్చర్యంతో) అదేమిటండి నారాయణభట్టుగారు? పుస్తకం రాయడం మాటలా.

నా—అశ్చ యెట్లాగౌతుంది? ఆసనం కుదుర్చుకుని కూర్చోవాలి. కాగితాలు పట్టుకోవాలి, సిరాబుడ్డిలో కలంముంచాలి, వ్రాయాలి, సామాన్యపుపనా, ఆకష్టానికి బిరుదు లేకుంటే యెట్లా? ఆంధ్రలోకమంతా ఆదరించనప్పుడు చివరకే పదిమంది అభిమానులైనా ఆదరించి ఒక మహాసభాసమావేశంచేసి యేదేనొక బిరుదియ్యకుంటే పడ్డకష్టమంతా వృథాగాదూ?

నే—తమరు వెక్కిరిస్తున్నారు.

నా—అశ్చ, ఉన్నమాటచెప్పా.

న—అసలు బిరుదులెందుకు నాయనా, కవి అనే పేరుచాలదూ? అది తేలికగా లభిస్తుందా? ఇంతకు ఈ విషయం మా అనుభవంలోది కాదు. మా తర్వాతవచ్చినవారికిది బాగా అనుభవం. ఆటా బిరుదులిచ్చినవారు ఏ చక్రవర్తులో, సంస్థాధీశ్వరులై యుండేవారు. వారి ఆస్థానాలో మహాపండితులుండేవారు. వారిలో కల్లా నుద్దండులైనవానికో, కాకుంటే బైటనుంచి వచ్చి కవిత్వంలోనో శాస్త్రాలలోనో. అక్కడి వారినందరిని ఓడించినవానికో అందరి యనుమతి మీద బిరుదులిచ్చేవారు. ఆ మహాస్థానంలో బిరుదిచ్చారంటే యందలి వారి ప్రతిభ ఆంధ్రలోకానికంతా విదితంగాబట్టి సర్వజనాంగీకారమయ్యేది.

నే—చిత్తం. తమరిప్పుడు మాట్లాడుతూంటే జ్ఞాపకమొస్తోంది. తమరు రెండుపాళ్లు సంస్కృతం, ఒకపాలు తెలుగువాడారనుకుంటారు నిజమేనా?

నా—ఇదుగో నీపేరేమిటో యెరగనుగాని, యేమిటా ప్రశ్న?

న—ఉండవయ్యా నారాయణా! తోచిన సందేహాలన్నీ అడగనీ. నీ సందేహం నివర్తి చేస్తానీను. అంతకుముందొక చిన్న ప్రశ్న వేస్తా. నీవు మాట్లాడేటప్పుడు దానిసమాధానంలో నీ సందేహ నివర్తియిమిడుంది. నీవు ధారాళంగా మాట్లాడేటప్పుడు, వ్రాసేటప్పుడు సంస్కృత మెక్కువ వాడుదాం, తెలుగెక్కువ వాడుదామనుకుంటావా?

నేను—(కొంచెముంచి) అనుకోను.

న—అనుకోవుగదా; ధారాళంగా చెప్పే కవిత్వంలో కవికూడా అట్లాగే అనుకోడు. వాడికున్న వాగ్సామగ్రి, భావావేశాన్నిబట్టి, భాషనొగ్గుకొస్తుంది. వాడికి తాను సంస్కృత మెక్కువ వాడుతున్నానా, తెలుగెక్కువ వాడుతున్నానా అన్న యోచనరోచదు. అట్లా యోజించి వ్రాస్తే కవిత్వంసాగదు, అతుకులమారి వ్రాత బయల్దేరుతుంది.

నే—దాన్నిబట్టి తర్వాతివాండ్లాయాకవుల పాండిత్య నిర్ణయంచేయడానికి వీలవుతుందాండి?

న—వీలుకాదని నామతం: సంస్కృత పదాలెక్కువ వాడిన కవి కొంగ్రంథంలో పరిపూర్ణ ప్రజ్ఞుండొచ్చు. తెలుగెక్కువ వాడినవానికి సంస్కృతంలో పూర్ణప్రజ్ఞుండొచ్చు. ఈసందర్భంలో నింకొక భేదంగూడా గమనించాలి: రెంటిలో కించిత్ప్రజ్ఞావంతులైనవారూ చక్కని కవిత్వం చెప్పగలరు. కవిత్వం పూర్వజన్మ సంస్కారం. ఆవేశాశ్రయం; ఇది కవిత్వ వేదాంతమవుతుంది.

నే—చిత్తం బోధమైంది. స్వామీ తమరు వైదీకులా నియోగులా?

నా—(ముసిముసినవ్వులు నవ్వుచుండును)

న—అని మీకాలంలో వాండ్లు వివాదపడి చివరకు ప్రాణాలు విసిగి కాబోలు, ఊరుకోవడ మెరుగున్నా. ఆ ఘర్షణకు శాఖాభిమానం కారణం. వైదీకులు నేను వైదీకినని, నియోగులు నేను నియోగినని సిద్ధాంతం చెయ్యడానికి పడ్డపాట్లన్నీ విని తెగనవ్వుకునేవాణ్ణి. మానారాయణం మండిపడేవాడు. దాని నిజం చెపావిను. మాకాలంలోనున్న బ్రాహ్మణజాతిలో నియోగి వైదీకి భేదాలులేవు. శాక్య, ఛాందస భేదాలుండేవి. శాక్యులంటే రాజకీయాల్లో వ్యవహరించేవారు. ఛాందసులంటే, ఛాందసశబ్దానికిప్పటి మీ అపార్థం లేదు – ఛాందసుడంటే వేదసంబంధమైన ఆచారాలవలంబిస్తూ, అతి శ్రోత్రియంగా నుండేవారని అర్థం-వాండ్లసాంప్రదాయాలనుబట్టే తర్వాత నియోగులు వైదీకులు బయలుదేరారు. వ్యవహారంలో కొంతటక్కరితనం తప్పదు కాబట్టి తరతరాలటక్కరితనం జీర్ణించి నియోగులంతా టక్కర్లని, వైదికులంతా కల్లాకపటమెరక్కుండా తరతరాలుండడంచేత తెల్లనివన్నీ పాలనుకునే వెఱ్ఱివారని,ఛాందసులని,వ్యవహారంలో నిలబడ్డాయి. ఇక ప్రకృతం; నాకు శాక్యప్రజ్ఞున్నా నేను శ్రోత్రియుణ్ణి.

నే—చక్కగా జెప్పారు. ఒక్క సందేహముంది. అడిగితే కోపమొస్తుందేమో నని ఝుడుస్తున్నా.

న—అడగవయ్యా నాయనా కొంతైతే నానికిగాకుండా తెలుసుకోవాలని అడిగే మాటకు కోపంవచ్చేవాడు ప్రజ్ఞావంతుడు కాడనే మతం వాణ్ణి నేను.

నే—అయితే సాహసిస్తా. అథర్వణా—

నా—ఆ అడుగు. అథర్వణాచార్లు భారతం వ్రాసాడని, అది నన్నయ్యవ్రాస్తున్న భారతం కంటే బాగుందని, దానికీర్ష్య చెంది అతడింట్లో లేనప్పుడతనింటిని నన్నయ పరశురామప్రీతి చేయించి దాన్లోనున్న భారతాన్ని నాశనం చేసాడనీకాదూ? నీ వడగబోయేది? తర్వాతవాండ్ల పుణ్యమాని, అతడింట్లో లేనప్పుడన్నారుకాని,యే రాత్రివేళో జేసి, బైటికి పారిపోమొస్తున్నవాణ్ణి కాళ్ళూ చేతులూ కట్టి ఆ మంటలో దహనం చేసాడన్నారుకారు. అట్లా వుంటుంది యీ ర్ష్యాసూయల్నటక. అట్లా అనుమానించే ప్రభువులంతా ఒక ఆలోచన జేయరెందుకనో! నన్నయ కవిత్వంకంటే అతని కవిత్వం బాగుంటేకాదు ఈర్ష్యను, పైనా గొడవాను? ఏదీ అతని పద్యమంటూ వొకటి చదువుతుంటారే నీ కొచ్చునా అది.

నే—వొచ్చు.

న—వస్తె చదువు చూద్దాం.

నే-శా. కృష్ణాతంతు నిబద్ధ బుద్ధులగు రాధేయాదులంగూడి శ్రీ
కృష్ణున్ కేవల మర్త్యుగా దలచి మద్గింపంగ నుత్సాహవ
ద్ధిష్ణుంబయ్యె సుయోధనుం డకట, ధాత్రీనాథ యాలింపుమా
ఉష్ణీషంబున గట్టవచ్చునె మదవ్యాఘ్రోగ్ర శుండాలమున్.

న—అది గదా పద్యం. ఒక కవి వ్రాసిన గ్రంథాల్లో మిన్నైందే నిలిచేట్టు, పద్యాల్లో గూడా మిన్నైనవే నిలుస్తాయనే ధర్మాన్నను సరిస్తే, నిది అనార్ఘ మంచిపద్యాల్లో నొక్కటైయుండాలకదా? ఆ కవిత్వంలో ధారాశుద్ధి, పసజాటిల్యం, భావోన్మేషం నన్నయ కవిత్వంలో నా మూడు లక్షణాలు పోల్చిచూడగల రసికులకు ఈర్ష్యాసూయ లేంక నుండాలో తెలియకపోదని సమాధానమిస్తే నీ సందేహం తీరకపోదు. "మర్దింపంగ"నని మా నన్నయ్య యే యవస్థలోనుప్రయోగించడు. ఇట్లాంటి అపవాదు ఇతని కర్మవశాన దాపరించింది. ఇంతకన్న నీ యేహ్య విషయాన్ని గురించి మేము ప్రసంగించం.

నే—పోనీండి. కోపమొస్తుందేమోనని ముందే ఝుడిసా. ఇంకొక విషయమడుగుతా చెప్పండి. కవిత్వం చెప్పడ మెందుకు?

నా—మా నన్నయ తన నన్నయభట్టీయంలో "పరోపకారార్థం కావ్యం" అన్నాడు. కవిత్వం చెప్పడం పరోపకారంకొరకు.

నే—అందుకొరకా, కవిసోత్కర్ష కొరకా?

నా—ఏం శంకలు చేస్తావు నాయనా? పనివాడికి తన పనితనంవల్ల కలిగే సోత్కర్ష తప్పతుందా? అది పరమావధిగా బెట్టుకోవడమేమి ధర్మం? సోత్కర్ష వ్యక్తికి సంబంధించింది. కావ్యం, కవిత్వం, దేశానికి సంఘానికి, సంబంధించినవి: అట్లాటప్పుడు దేశసంఘోత్కర్ష పరమావధి చేసుకోవడం ధర్మంగాని, ఎవడో కవి యేమూలో కూర్చుని నా ఉత్కర్ష కోసం చెబుతున్నా ఇష్టమైతే వినండి, లేకపోతే మానండంటే, యేంసార్థకం? అయితే అట్లాటి గమనీయంబెట్టుకొని వ్రాసినా అది రాణించవచ్చు. ఎప్పుడు రాణిస్తుందంటే పదిమందికిన చ్చి యేదోవిధంగా నుపకరించేటప్పుడే రాణిస్తుంది. ఇదంతా సూక్ష్మంగా దోచే, స్థూలంగా పరోపకారార్థం కావ్యమన్నాడు మా వాడు.

న—నాయనా నేనింకా విపులంజేస్తా విను. ఈసందర్భంలో పరోపకారం రెండురకాల జరగొచ్చు. నీతిబోధకంగానైనా చదువరుల హృద్యకరంగానైనా జరగొచ్చు. ఏదో గొప్పకథనో చిన్నకథనో తీసుకుని, ఏదో పాపం తాత్కాలికంగా సాగినా, కొంతకాలం జరిగేవరకు పండక పోదని, తనకున్న శక్తిసామర్థ్యాల వినియోగించి కవి వ్రాయవచ్చు: లేకుంటే పాపమో పుణ్యమో యేదో కథలో నిమిడ్చి చదువుకునేవాండ్లాహా యనుకునేటట్లు రచింపవచ్చు. అయితే ఆ యాహా యెటువంటిది? తాత్కాలికంగా మనమనేకవిషయాల కాహా యంటున్నాం. అట్లాటి ఆహా,కొన్నిసట్ల మననం జేసుకున్నపుడల్లా యనుపించి మొదటి సంతోషాన్ని ఆనందం దశకెత్తుతుంది. అట్టి యానందాన్ని కవి కలిగిస్తూనే వుంటాడు. అట్లా కలిగించేవాడే కవి. అట్లాటి ఆనందాన్ని కల్పించడంకూడా పరోపకారం చేయడమే. ఇక్కడొక్క భేదం స్మరించాలి. అట్లాటి ఆనందం మంచి విషయాల్ని గురించా, చెడువిషయాల్ని గురించా అని. ఈ శంకతుంటరితనానికి చెడు. చెడ్డవిషయాల వర్ణనవల్ల కలిగే ఆనందం పూజనీయం కాదని కొంచెం విచారించగల ప్రతివ్యక్తికి విశదమే. స్త్రీలోలత జరిగినంతవరకు ఆనందాన్ని కలిగిస్తుంది. కాబట్టి ఒకచక్కని జంటనీసుకుని వారి శృంగారచేష్టలన్నిటిని చదువరుల శరీరాలు గగుర్పొడిచేట్లు వర్ణించగల శక్తిమంతులైన కవులున్నారు. కాని

(22 వ పేజీ చూడుడు)

శ్రీ యన్. గోపాలస్వామి అయ్యంగారు

(భారత ప్రభుత్వపు మంత్రివర్గములో క్రొత్త మంత్రిగా నియమింపబడి మొన్న మొన్ననే అధికార స్వీకారము చేసినారు.)